## వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలి




www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 30 | జనవరి | 2025
పేజీలు 7

### ఎంఎల్‌సి ఎన్నికలకు
# మోగిన నగారా

**-ఫిబ్రవరి 27న ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నిక**
**-అమల్లోకి ఎన్నికల కోడ్**



**ప్రజాపక్షం/ఖమ్మం :** శాసన మండలి ఎన్నికల నగారా మోగింది. రాష్ట్రంలోని రెండు ఉపాధ్యాయ ఎంఎల్‌సి , ఒక పట్టభద్రుల స్థానానికి సంబంధించి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల శాసన మండలి స్థానంతో పాటు ఉపాధ్యాయ శాసన మండలికి, వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ శాసన మండలి స్థానానికి ఫిబ్రవరి 27న ఎన్నికలు జరగనున్నాయి. అలుగుబెల్లి నర్సిరెడ్డి, కె. రఘోత్తమరెడ్డి, టి.జీవన్‌రెడ్డి పదవి కాలం మార్చి 29తో ముగియనుండడంతో ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేశారు. ఫిబ్రవరి మూడవ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. నామినేషన్ల పరిశీలన 11వ తేదీన జరుగుతుంది. 13వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఉంది. 27వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనుంది. మార్చి మూడవ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. ఎనిమిదవ తేదీ నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తన నియామవాళి అమల్లోకి వచ్చింది. ఉపాధ్యాయ ఎంఎల్‌సికి సంబంధించి యుటిఎఫ్ ఇప్పటికే తన అభ్యర్థిగా తిరిగి అలుగుబెల్లి నర్సిరెడ్డిని ప్రకటించి ప్రచారం నిర్వహిస్తుంది. మిగిలిన ఉపాధ్యాయ సంఘాలు తమ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

### మహిళలకు
# రాజకీయాధికారాన్ని కల్పించాలి

**-మహిళా సాధికారతపై ఉద్యమించండి : బాగం హేమంతరావు**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దేశ జనాభాలో సగ భాగం ఉన్న మహిళలకు రాజకీయ అధికారం లేకుండా మహిళల సమస్యలు పరిష్కారం కావని, స్వాతంత్ర్య వచ్చి 78 సంవత్సరాలు అయినా రాజకీయ అధికారం లేకుండా అడ్డుకోవడం సిగ్గుచేటని బాగం హేమంతరావు అన్నారు. మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ) ఖమ్మంజిల్లా జనరల్ బాడీ సమావేశం బుధవారం పోటు కళావతి అధ్యక్షతన ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మహిళలు గుర్తుకొస్తారు కాని అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలను విస్మరిస్తున్నారన్నారు. మహిళా సాధికారతపై మహిళలు

మిగతా 2లో..

### పారిశుధ్య పనుల్లో
# నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



**-శానిటరి సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీస్**
**-శానిటరి ఇన్‌స్పెక్టర్ సస్పెండ్**
**-డివిజన్లలో పర్యటించిన నగర కమిషనర్**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. 21వ డివిజన్‌కు సంబంధించి శానిటేషన్ ప్లాన్ ఇవ్వలేదని శానిటరీ సూపర్ వైజర్ సాంబయ్యకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. అదేవిధంగా పారిశుధ్య పనులను పర్యవేక్షించడం లేదని డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌ను కమిషనర్ సస్పెండ్ చేశారు. బుధవారం నగర కమిషనర్ పారిశుధ్య పనుల పరిశీలనలో భాగంగా కార్పోరేషన్ పరిధిలోని

మిగతా 2లో..

### పులిగుండాల ప్రాజెక్టుకు
# సందర్శకులను పెంచాలి



**-ఏకో టూరిజం ప్రారంభానికి సన్నాహాలు**
**-అడవులను, ప్రాణవాయువును ఇచ్చే ప్రకృతిని కాపాడుకోవాలి**
**-అడవి మార్గంలో కాలి నడకన కలెక్టర్**
**-పులిగుండాల ప్రాజెక్టు సందర్శన**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ /పెనుబల్లి :** పచ్చని అడవి, ఆహ్లాదకరమైన వాతావరణంతో కనువిందు చేస్తున్న పులిగుండాల ప్రాజెక్టుకు సందర్శకులను పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.

మిగతా 2లో..

# మహిళలకు రాజకీయాధికారాన్ని కల్పించాలి






(మొదటిపేజీ తరువాయి)

ఉద్యమించాలని పిలుపునిచ్చారు. టివి సీరియల్స్‌లలో మహిళలను విలన్స్‌గా చిత్రీకరించడం వల్ల ప్రజల్లో చులకన భావన ఏర్పడుతుందని దీనిని అదుపు చేయాలని హేమంతరావు కోరారు. జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి ఏపూరి లతాదేవి మాట్లాడుతూ దేశంలో పబ్‌ల్లో బహిరంగంగా డ్రగ్స్, గంజాయి లభిస్తుండడంతో వాటికి బానిసలైన యువత మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. నిత్యం ఏదో ఒక చోట మహిళలపై అకృత్యాలు జరుగుతున్నాయన్నారు. వాటిని నిర్మూలించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. సోషల్ మీడియాలో మహిళలను వ్యాపార వస్తువుగా ప్రచారానికి వాడుకుంటున్నారని వీటిని అరికట్టాలన్నారు. వెబ్‌సీరిస్‌లపై నియంత్రణ లేకపోవడంతో వాటిని చూసి హత్యలకు పాల్పడుతున్నారన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు చేసినప్పటికీ వాటిని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కేంద్ర రక్షణ చట్టం అమలు చేయాలని కోరారు. మహిళలకు ఉచితంగా కార్పొరేట్ విద్య, వైద్యం అందించాలని ఆమె కోరారు. రానున్న జిల్లా మహాసభలకు ముందుగా గ్రామ శాఖల నిర్మాణం పటిష్టం చేసుకుని గ్రామ, మండల మహాసభలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, మహిళా సమాఖ్య నిర్మాణ ఉప సంఘం బాధ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, నాయకులు మందడపు రాణి, కన్నెబోయిన విజయమ్మ, కర్నాటి నళిని, సోమోజుల సరోజనమ్మ, ఎస్‌కె రంజాబీ, మహ్మద్ జాస్మిన్, మేళ్లచెరువు లలిత, దండి రాజేశ్వరి, కళావతి, రాంబాయమ్మ, బండారు కుమారి, ఈశ్వరమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పులిగుండాల ప్రాజెక్టుకు సందర్శకులను పెంచాలి





(మొదటిపేజీ తరువాయి)

పులిగుండాల ప్రాజెక్టును ఏకో టూరిజం ప్రాంతంగా ఫిబ్రవరి నుంచి ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సత్తుపల్లి డివిజన్ తల్లాడ పరిధిలోని కనకగిరి రిజర్వు ఫారెస్ట్ పులిగుండాల ప్రాజెక్టును ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్‌తో కలిసి పరిశీలించారు. సుమారు ఐదు కిలో మీటర్లు అడవి మార్గం గుండా కాలి నడకన గుట్టపైకి ఎక్కి పులిగుండాలను కలెక్టర్ సందర్శించారు. ఏకో టూరిజం ప్రణాళికలో భాగంగా కలెక్టర్ కమాండర్ జీపులో ప్రయాణించి పచ్చని సోయగంతో ఉన్న అటవీని సంరక్షిస్తూ ఇక్కడ ఆహ్లాదకరమైన పరిస్థితులను ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ కోసం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పాలపిట్ట ఓరియల్ టవర్ ఎక్కి బైనాక్యూలర్ ద్వారా చుట్టు పక్కల ఏరియల్ వ్యూను కలెక్టర్ చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువగా మనకు ప్రకృతి పరంగా అందమైన గుట్టలు, చెరువు, గుట్టల నుండి జాలువారే నీళ్లతో అడవిని పర్యాటకరంగా అభివృద్ధి చేసుకోవాలని దీని వల్ల ఆరోగ్య అనే సంపద వస్తుందన్నారు.రానున్న తరాలకు పర్యాటక ప్రాంతంగా తీసుకువచ్చి ప్రకృతిని కాపాడుతూ అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రకృతిని కాపాడుకోలేక మనకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని దానిని నివారించేందుకు అభివృద్ధి చేపట్టామన్నారు. పులిగుండాల ప్రాజెక్టులో ఆహ్లాదం పంచేవిధంగా సౌకర్యాలు ఏర్పాటు చేసి సందర్శకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టామన్నారు. పర్యాటకుల కోసం చెరువులో బోటింగ్, వసతి కాటేజ్‌లు, భోజనం, త్రాగునీరు వసతులను కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబం, పిల్లలతో సందర్శించి ఆనందంగా గడిపేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. చెరువులో సంచరించే పక్షులు, పులిగుండాల చరిత్ర చెప్పేవిధంగా వినూత్న కార్యక్రమాల నిర్వహణకు గైడ్‌లు కూడా అందుబాటులో ఉంటారన్నారు. పిల్లలకు సైక్లింగ్, ఓపెన్ జిమ్, అడ్వెంచర్ యాక్టివిటిస్ వంటివి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, అటవీ అభివృద్ధి అధికారిణి మంజుల, అటవీ రేంజ్ అధికారి జి. నాగేశ్వరరావు, అటవీ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

21, 41 డివిజన్లలో పర్యటించారు. శానిటరీ సూపర్ వైజర్, ఇన్‌స్పెక్టర్, జవాన్‌తో కమిషనర్ మాట్లాడారు. ఎంత మంది వర్కర్లు వచ్చారు, ఎంత మంది గైర్హాజరు అయ్యారు, మొత్తం డివిజన్లలో ఎంత మంది వర్కర్లు ఉన్నారు, ఏమేమి పనులు చేస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌ను పరిశీలించారు. ఏ రోజు ఏ రోడ్డులో పనిచేస్తున్నారు అనే వివరాలను లాక్ బుక్స్, రిజిస్టర్లను పరిశీలించారు. 21వ డివిజన్‌కు సంబంధించి శానిటేషన్ ప్లాన్ ఇవ్వలేదని సూపర్‌వైజర్ సాంబయ్యకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. పనులు పర్యవేక్షించడం లేదని ఇన్‌స్పెక్టర్ రమేష్‌ను సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో జవాన్ అటెండెన్స్ రిజిస్టర్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతకం, స్థానిక కార్పొరేటర్ సంతకం తప్పనిసరిగా చేయించాలన్నారు. ఆ డివిజన్‌లో ఎంత మంది విధులకు హాజరయ్యారు అనేది శానిటరీ ఇన్‌స్పెక్టర్, డివిజన్ కార్పొరేటర్‌కు తెలియజేయాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డివిజన్‌కు ఇద్దరు చొప్పున పారిశుధ్య కార్మికులను ప్రతి వారం డివిజన్ పరిధిలో ఉన్న కాలువలన్ని శుభ్రపరిచేలా చూడాలన్నారు. కాలువలు శుభ్రపర్చని యెడల ఇన్‌స్పెక్టర్, జవాన్లపై చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్లలో ఖచ్చితంగా శానిటేషన్ ప్లాన్ చేసుకుని అన్ని కాలువలు శుభ్రం చేయాలన్నారు. 41వ డివిజన్‌లో రోడ్లపై చెత్త ఉండడంతో



జవాన్‌ను మందలించారు. ఓ రెస్టారెంట్ వారు రోడ్డు పై చెత్త వేసినందుకు ఆ చెత్తను శుభ్రం చేయించి వారికి జరిమానా విధించాలని కమిషనర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం లకారం ట్యాంక్ బండ్‌లో పర్యటించి అక్కడ మొక్కల పెంపకం, డివైడర్ మెయింటినెన్స్, శానిటేషన్ పనులను పరిశీలించారు. ట్యాంక్‌బండ్ సూపర్ వైజర్‌తో మాట్లాడి రోజు ఎంత మంది వాకర్స్ వస్తున్నారు అడిగి తెలుసుకున్నారు.

# మాజీ ఉప ముఖ్యమంత్రిని కలిసిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి కెఈ కృష్ణమూర్తిని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ఎంఎల్‌ఏ కాలనీలో మాజీ ఉప ముఖ్యమంత్రి కెఈ కృష్ణమూర్తిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జి. రాజేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు నిరసన



**ప్రజాపక్షం/బోనకల్‌:** ప్రేమించి పెళ్లి చేసుకొని మొఖం చాటువేసి తనను పట్టించుకోవడం లేదని ఓ యువతి నిరహార దీక్షకు దిగిన సంఘటన మండలంలోని బ్రాహ్మణపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. మండలంలోని కలకోట గ్రామానికి చెందిన చావాలా పూజిత పక్కనే ఉన్న కలకోట గ్రామానికి చెందిన మడుపల్లి గోపితో ప్రేమ వివాహం చేసుకుంది. గోపి కొన్ని రోజులుగా తనను పట్టించుకోవడం లేదని బ్రాహ్మణపల్లిలోని ప్రియుడి ఇంటి వద్ద తనకు న్యాయం చేయాలని తల్లిదండ్రులతో కలిసి నిరాహర దీక్షకు దిగింది. పోలీసు అధికారులు, మహిళ సంఘాలు తన న్యాయపోరాటానికి అండగా నిలవాలని పూజిత కోరుతుంది.

# సంగెపు వెంకటేశ్వరరావుకు డాక్టరేట్



**ప్రజాపక్షం/బోనకల్‌:** మండలంలోని మోటమర్రి గ్రామానికి చెందిన చెందిన సంగెపు వెంకటేశ్వరరావు జెఎన్‌టియూ హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో కెమిస్ట్రీలో పిహెచ్‌డి పూర్తి చేశారు. దీంతో ఆయనకు డాక్టరేట్ అవార్డు ప్రదానం చేసినట్లు అవార్డు గ్రహిత వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన ''సోనోకెమికల్ సింతేసిస్ అండ్ బయాలజికల్ అస్సయ్ అఫ్ సంనోవెల్ ఇండాజోలు, పైరాజోలు, క్వినాజోలునోనే అండ్ ఐసొక్వినోలినోనే డేరివటివ్స్'' అన్న అంశంపై డాక్టర్ రమాదేవి, డాక్టర్ కీర్తికుమార్‌జైన్ ఆధ్వర్యంలో పరిశోధన చేశారు. ఈ పరిశోధన విజయవంతం కావడంతో విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్ పట్టాను ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా తనను ప్రొత్సహించిన బంధువులు, మిత్రులు, గ్రామస్థులు, గురువులకు కృతజ్ఞతలు తెలిపారు.

# సిడిసి ఛైర్మన్‌గా సూర్యనారాయణరెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం :** కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఛైర్మన్‌గా కూసుమంచి మండలం ఈశ్వరమాధారం గ్రామానికి చెందిన యరబోలు సూర్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ షుగర్ అండ్ కేన్ కమిషనర్ డా॥ జి. మల్సూర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కి నూతన కౌన్సిల్ ఏర్పాటు చేసినట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. నేలకొండపల్లి మండలం మోటాపురం గ్రామానికి చెందిన గుదిమళ్ల మధు, చెన్నారం గ్రామానికి చెందిన జోగుపర్తి కృష్ణారావులతో పాటు షుగర్ ఫ్యాక్టరీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ వై. కోటయ్యను, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె. అప్పారావులను సభ్యులుగా నియమించారు. ఈ కౌన్సిల్ రాబోవు మూడేళ్ల కాలం లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు కొనసాగుతుందని తెలిపారు. చక్కెర కార్మాగారం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

# చికిత్స పొందుతూ బాలిక మృతి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాలిక మృతి చెందిన సంఘటన రఘునాథపాలెం మండల పరిధిలోని రేగులచలక గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మరియమ్మకు ఇద్దరు కుమార్తెలు చిన్న కుమార్తె అయినా పొట్టా శ్రావణి (13) కోయచలక ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతుంది. అనారోగ్యంతో శ్రావణి తండ్రి ఐదేండ్ల క్రితం మృతి చెందగా తల్లి కూలీ పనులు చేస్తూ పిల్లలను చదివిస్తుంది. ఈ క్రమంలో ఈనెల 25న పాఠశాలలో తోటి స్నేహితురాళ్లతో ఆడుకుంటూ శ్రావణి కిందపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అప్పటి నుంచి కొంత నలతగా ఉంటున్న శ్రావణి ఈనెల 28న మంగళవారం తీవ్రమైన తలనొప్పి రావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందగా మృతదేహాన్ని బాలిక స్వగ్రామానికి తీసుకు వచ్చారు. బాలిక మృతి సమాచారం తెలుసుకున్న పోలీసులు బాలిక ఇంటికి వెళ్లి బంధువులతో మాట్లాడారు. తల్లి మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు పోస్టుమార్టం నిమిత్తం మరల ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి శ్రావణి భౌతికాయాన్ని తరలించారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

# రైతుల కళ్లలో కన్నీళ్లు చూడొద్దు



**రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్**

**ప్రజాపక్షం/కొణిజర్ల :** వ్యవసాయం తప్ప మరేపని చేయలేని రైతులు ఎన్ని కష్ట నష్టాలు వచ్చిన వ్యవసాయన్ని వదులుకోకుండా వ్యవసాయం చేస్తున్న రైతుల కళ్లలో నుంచి కన్నీళ్లు రాకుండా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు కృషిచేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు దొండపాటి రమేష తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని చిన్నమునగాలలో బుధవారం రైతు సంఘం గ్రామశాఖ మహాసభ పరిటాల భద్రయ్య అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో వారు మాట్లాడుతు ప్రభుత్వం భూసమగ్ర సర్వే నిర్వ హించి సాదాబైనామాలద్వారా రైతులు చేసుకున్న భూములకు పాసుపుస్తకాలు ఇవ్వాలని పేర్కొన్నారు. పంటలు నిల్వ చేసుకునేందుకు గ్రామాల్లో గోదాములు నిర్మించాలని కోరారు. పంటపొలాలకు వెళ్లే రహదారులు అభివృద్ధిచేయాలని తెలిపారు. సహకారసంఘాల ద్వారా ప్రతిరైతు కుటుంబానికి ఆరోగ్యభద్రత, ఇన్సూరెన్స్ కార్డులు ఇవ్వాలని అన్నారు. ఈ మహాసభలో రైతుసంఘం నాయకులు పాపగంటి సుదర్శన్, మోహన్‌రావు, జయరాజు, నాగవరపు భద్రయ్య, రమేష్, రాజారత్నం, పాల్గొన్నారు. గ్రామశాఖ రైతుసంఘం అధ్యక్షులుగా పరిటాల భద్రయ్య తోపాటు 11 మందిని కమిటీసభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# అట్టహాసంగా ఏఐకేఎస్ గ్రామశాఖ మహాసభలు




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం కాచిరాజుగూడెం, కస్నాతండా పంచాయతీలలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఏఐకేఎస్) గ్రామ మహాసభలను మంగళవారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన గ్రా మ కమిటీలను రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడ కంటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజనసంఘం రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ రాంకోటి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మాజీ ఎంపిటీసి రామ్మూర్తి, రైతు సంఘం నాయకులు ఏలూరి భాస్కర్, ఎర్రబోయిన వెంకన్న, మక్కల వెంకన్న, ఉపేందర్‌రెడ్డి, బానోతు జగన్, వల్లాల లక్ష్మ ణస్వామి, మారుతి లాలయ్య, వల్లాల శివరాజు, అజ్మీర హరి పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందించాలి




**-సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో ధర్నా**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిజమైన అర్హులకే అందించాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఖమ్మంజిల్లా కమిటీ పిలుపు మేరకు ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నయాబజార్ సెంటర్ నుండి పిఎస్ఆర్ రోడ్డు మీదుగా ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆవుల అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా కార్యక్రమాల అమల్లో ఇందిరమ్మ కమిటీల రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన వారికి అందించాలన్నారు. ప్రజాపాలనలో లక్షలాది మంది పేదలు దరఖాస్తు చేసుకుంటే అధికారులు సర్వే అనంతరం గ్రామసభలో ప్రకటించిన లిస్టులో అనేక తప్పుల తడకలు ఉన్నాయన్నారు. వీటికి కారణం ఇందిరమ్మ కమిటీలే అన్నారు. అన్ని గ్రామ సభలలో చదివిన లిస్టుపై సర్వే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలను అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు తమకు దగ్గర ఉన్న బంధు వర్గాలకు మంజూరు చేసే విధంగా పైరవీలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పివోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నాయకులు కె. శ్రీను, సత్తార్, కె. శ్రీనివాస్, నర్సింహారావు, లెనిన్, జాస్మిన్, రామారావు, శారద, సుజాత, వెంకటేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా :** అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా ఇవ్వాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కమిటీ పిలుపు మేరకు రఘునాథపాలెం మండల




తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ జిల్లా నాయకురాలు ఆవుల మంగతాయి, మండల కార్యదర్శి కేలోత్ లక్ష్మణ్ లు మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భూమి లేని నిరుపేదలకు ఆత్మీయ భరోసా ఏడాదికి రూ. 12వేలు అందించేలా ఖచ్చితమైన సర్వే నిర్వహించాలన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, తెల్ల రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు జర్పుల దేవ్లా, దరావత్ లక్ష్మణ్, మేకా రామనాథం, రామారావు, పి. పిచ్చయ్య, నర్సింహారావు, ఇస్లావత్ రమేష్, కేలోత్ సేవాలక్ష్మి నారాయణ, రవి చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

# నా తమ్ముడిది ఆత్మహత్య కాదు.. హత్య

**-విచారణ జరిపించి న్యాయం చేయండి**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తన తమ్ముడి గొల్లముడి కేశవది ఆత్మహత్య కాదని హత్య అని పూర్తి స్థాయిలో విచారణ జరిపి మాకు న్యాయం చేయాలని మృతుని సోదరి గొల్లముడి స్వప్న కోరారు. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గొల్లముడి స్వప్న మాట్లాడుతూ హారిక అనే మహిళతో తన తమ్ముడు కేశవకు పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారిందని ఆమె తెలిపారు. ఇట్టి విషయం తెలిసి యువతి కుటుంబ సభ్యులు పథకం ప్రకారమే హత్య చేయించి ఉంటారని మాకు అనుమానంగా ఉందన్నారు. దీనికి సంబంధించి పోలీసులు కూడా ఎటువంటి విచారణ చేపట్టడం లేదన్నారు. కేశవ మృతిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మృతుని కుటుంబ సభ్యులు మరియమ్మ, భారతమ్మ, నాగయ్య, కుమారి, భద్రమ్మ, సునీత, మార్తమ్మ, నవీన్, ప్రసాద్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడలో ఆయిల్ ఇంజన్ చోరీ



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ కేతినేని థియేటర్ పక్కన గల తల్లాడ అన్నారుగూడెం రోడ్డులోని పొలంలో మంగళవారం తెల్లవారుజామున ఆయిల్ ఇంజన్ చోరీకి గురైంది. తల్లాడకు చెందిన రైతు గరిడేపల్లి బుచ్చయ్య వరి పొలానికి నీళ్లు పెట్టేందుకు బావి వద్ద ఏర్పాటు చేసిన ఆయిల్ ఇంజన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రెండు ఆయిల్ ఇంజన్లు బావికి ఏర్పాటు చేయగా రెండింటిని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించి అందులో ఒక దానిని రోడ్డు వద్ద వదిలేసి ఒక దానిని ఎత్తుకెళ్లారు. దీని విలువ సుమారు రూ.15వేలు ఉంటుందని, ఈ విషయమై రైతు బుచ్చయ్య తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. పంట పొలాల్లో వరుస దొంగతనాలతో అన్నారుగూడెం తల్లాడ రోడ్డులో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల క్రితం ఇదే రోడ్లో రైతు దగ్గుల శ్రీనివాస్‌రెడ్డికి చెందిన ఐదు మిర్చి బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించిన విషయం విధితమే. అది మరుకముందే మరో దొంగతనం చోటు చేసుకోవడం గమనార్హం.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. బుధవారం ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి హాజరై ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఖమ్మం రూరల్ మండలంలోని 70 మంది లబ్దిదారులకు మంజూరైన రూ. 26లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి ఏఎంసి చైర్మన్ బైరు హరినాధబాబు, రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కల్లెం వెంకటరెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు కోటి రమణ, పిసిసి సభ్యులు దరావత్ రామ్మూర్తి నాయక్, నాగండ్ల శ్రీనివాసరావు, 60వ డివిజన్ కార్పొరేటర్ నిరంజన్, ఏఎంసి డైరెక్టర్లు పంతులు నాయక్, చిన్నక్క ష్టారావు, వంగూరి రవి, నాయకులు మద్ది మల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, కేతినేని వేణు, అశోక్ నాయక్, వీరెల్లి అప్పారావు, భూక్యా సురేష్ నాయక్, వెంపటి రవి, ప్రతాపనేని రఘు, తమ్మినేని రవి తదితరులు పాల్గొన్నారు.

# మాంట్ ఫోర్ట్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరం లోని మాంట్ ఫోర్ట్ హైస్కూల్ 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 31న నిర్వహించనున్న డైమండ్ జూబ్లీ ఉత్సవాలను జయప్రదం చేయాలని పూర్వ విద్యార్థుల సంఘం పిలుపునిచ్చింది. మాంట్ ఫోర్ట్ 352వ జయంతి, డైమండ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని మాతా శిశు కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు పాల్గొని మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నేటి విద్యార్థులకు మెరిట్ అవార్డ్స్ ఆనాడు బోధించిన ఉపాధ్యాయుల పేరిట ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. మాంట్‌ఫోర్ట్ స్కూల్ అభివృద్ధికి కృషి చేస్తున్న పూర్వ విద్యార్థుల సంఘాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఆర్‌జెసి కృష్ణ, ప్రధాన కార్యదర్శి వంజాకు లక్ష్మి నారాయణ, కోశాధికారి రమేష్‌బాబు, కార్యవర్గ సభ్యులు డాక్టర్ హనుమాన్, డాక్టర్ అయ్యదేవర రాంబాబు, ప్రవీణ్, వైవి శర్మ, మానుకొండ శివకుమార్, లక్ష్మణ్‌బాబు, భవాని ప్రసాద్, బెందడి కుమార్, పాపిట్ల ఉపేందర్, బాలశౌరి, శేఖర్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిజమైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకోసం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలు నిజమైన లబ్దిదారులకు ఇవ్వాలని సిపిఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై పుల్లయ్య అన్నారు. మాస్‌లైన్ జిల్లా కమిటి పిలుపుమేరకు కొణిజర్ల మండల కమిటి ఆధ్వర్యంలో బుధవారం కొణిజర్ల తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు సంక్షేమపథకాల్లో భాగంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్ కార్డులు మంజూరి అర్హులకు మాత్రమే ఇవ్వాలని వీటి మంజూరిలో ఎటువంటి రాజకీయ జోక్యం ఉండకూడదని అన్నారు. ఎంతో మంది నిరుపేదలు ఉండటానికి ఇల్లు లేక ఎంతో ఇబ్బంది పడుతున్నారని అలాంటి వారిని గుర్తించి ముందుగా వారికే ఇండ్లు ఇవ్వాలని అన్నారు. అధికార కాంగ్రేస్‌పార్టీ నాయకులు కార్యకర్తలకు, దగ్గర బంధువులకు మంజూరుచేసేవిధంగా పైరవీలు చేస్తున్నారని నిజమైన లబ్దిదారులకు పథకాలు అందకపోతే ప్రజలు తిరగబడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలకార్యదర్శి తడికమళ్ల సీతారాములు, డివిజన్ నాయకులు పాశం అప్పారావు, నూనావత్ శ్రీనివాస్, వేద్దేసత్యం, చింతల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం కార్పోరేషన్‌లో రెవెన్యూ మేళా




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ మేళా నిర్వహించారు. కార్పోరేషన్ పరిధిలో రెవెన్యూ తప్పుల సవరణ, ఇంటి నెంబర్ల తప్పు, డబుల్ ఇంటి నెంబర్లు, ఇంటి పన్ను, పంపు పన్నులకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డును సందర్శించిన మేయర్



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో గల దానవాయిగూడెం డంపింగ్ యార్డును మేయర్ పునుకొల్లు నీరజ సందర్శించారు. బుధవారం మేయర్ పునుకొల్లు నీరజ డంపింగ్ యార్డును సందర్శించి అక్కడ నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గతంలో చెత్తతో పేరుకుపోయిన ప్రాంతంలో వివిధ రకాల మొక్కలు నాటి ఫారెస్ట్ ప్లాంటేషన్ (ఫ్రూట్ ప్లాంట్)గా రూపొందించినట్లు ఆమె తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని తెలిపారు. మొక్కల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణతో పాటు కోతులకు ఆహారాన్ని అందించేందుకు ఉపయోగపడతాయన్నారు. కార్పోరేషన్ నుంచి వచ్చే తడి చెత్తను వర్మి కంపోస్టు తయారీకి తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి రాధిక, ఎన్విరాన్‌మెంట్ ఏఈ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మందా కృష్ణమాదిగకు అభినందనలు



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఎస్‌సీ వర్గీకరణ, సమాజంలోని సమస్త వర్గాల ప్రజల కోసం చేసిన పోరాటాల ఫలితంగా మందా కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం అభినందనీయం అని ఎమ్మెస్పీ జాతీయ నాయకులు వంగూరి ఆనందరావుమాదిగా అన్నారు. బుధవారం ఖమ్మంరూరల్ మండలం గుదిమళ్లలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...30సంవత్సరాల ఎమ్మార్పీఎస్ వర్గీకరణ పోరాటంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని, ఫిబ్రవరి 7న లక్షగొంతులు, వెయ్యిడప్పుల కార్యక్రమాన్ని నిర్వహించడం జరగుతుందన్నారు. కావున మాదిగ, ఉపకులాల ఒక్కొక్కరు ఒక్కో డప్పును సంకనేసుకుని, తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. అనంతరం మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూకపొంగు వెంకయ్యమాదిగ, ప్రేమ్‌కుమార్‌మాదిగ, అపరంజిమాదిగ, చెరుకుపల్లి వెంకటేశ్వర్లుమాదిగ, జమ్మలమడుగు దాస్‌మహారాజ్ మాదిగ, చెరుకుపల్లి బాబుమాదిగ, చేకూరి చైతన్యమాదిగ, చెరుకుపల్లి నాగేశ్వరరావుమాదిగ, వెంకన్నమాదిగ, యువకులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వెంగన్నపాలెం మెయిన్‌రోడ్ లో వారంతపు సంత ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/జూలూరుపాడు: వెంగన్నపాలెం మెయిన్ రోడ్ లో వారంతపు సంత ఏర్పాటు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తంబర్ల నరసింహారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తంబర్ల నరసింహారావు మాట్లాడుతూ జూలూరుపాడు మండల వ్యాప్తంగా ఉన్న 64 గ్రామాలలో మిర్చి కోత సీజన్ కావడంతో వలస కూలీలు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి కూలి చేస్తూ జీవనం సాగిస్తున్నారని, ఈ క్రమంలో వెంగన్నపాలెం మెయిన్ సెంటర్‌కు వచ్చి నిత్యవసర సరుకులు కొనుగోలు చేస్తున్నారని, ఇదే అదునుగా చూసుకొని కొందరు వ్యాపారులు అత్యధిక ధరలకు నిత్యవసర వస్తువులను విక్రయిస్తున్నారని, కావున వెంగన్నపాలెం మెయిన్ సెంటర్‌లో వారాంతపు సంత ఏర్పాటు చేస్తే వలస కూలీలకే కాకుండా మండల ప్రజలకు కూడా నిత్యవసర సరుకులు సరసమైన ధరకు అందుతాయని వారన్నారు. కనుక తక్షణమే వెంగన్నపాలెం మెయిన్ సెంటర్లో వారాంతపు సంతను ఏర్పాటు చేసి వలస కూలీలతో పాటుగా మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఉపయోగకరంగా ఉండి సరసమైన ధరలకు వచ్చే విధంగా తమరు కృషి చేయాలని బుధవారం జూలూరుపాడు ఎంపీడీవో డి కరుణాకర్ రెడ్డి కి మెమరాండం అందించటం జరిగిందని వారు తెలిపారు.

## ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు రామదాసు జయంతోత్సవాలు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : కంచర్ల గోపన్న (భక్తరామదాసు) జయంతి ఉత్సవాలను వచ్చే నెల 1, 2, 3 తేదీలలో నిర్వహించనున్నారు. భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, పాలనా యంత్రాంగం, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం. శ్రీ భక్తరామదాసు విద్వత్ కళాపీఠం సంయుక్తంగా ఉత్సవాలను నిర్వహించనున్నారు. జయంతి ఉత్సవాల కు సంబంధించిన కరపత్రాలను బుధవారం రామదాసు ధ్యాన మందిరంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు ఆవిష్కరించారు. ఉత్సవాలను 1వ తేదిన రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లతో పాటు ఎంపీ, ఎమ్మెల్సీలు హాజరువుతున్నట్లు నిర్వహకులు తెలిపారు. మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నటు పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, గ్రామ పెద్దలు రాయపూడి శ్రీనివాసరావు, తెల్లగొర్ల లింగస్వామి, వాసం లక్ష్మయ్య, దేవరశెట్టి లక్ష్మణావు, జీ.వీ.ఆర్.గుప్తా, చిన్నంశెట్టి రాంబాబు, కడియాల నరేష్, విద్వత్ కళాపీఠం ప్రతినిధులు, మందిరం అర్చకులు సామిత్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల్లో రాజకీయ జోక్యాన్ని నివారించాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ సంక్షేమ పథకాలలో రాజకీయ జోక్యం ను నివారించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి పగిడికత్తుల రామదాసు డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి ప్రతం ను స్థానిక తహశీల్దార్ కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పథకాలలో అర్హత కలిగిన వారికి మాత్రమే పథకాలు అందించాలని కోరారు. పథకాలలో ప్రభుత్వం విధి విధానాలు అమలు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభలలో ప్రకటించిన వారిలో ఎక్కువ మంది అనర్హులు ఉన్నారని మండిపడ్డారు. సమగ్ర విచారణ నిర్వహించి, అర్హత కలిగిన వారిని లబ్దిదారులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పైరవీకారుల పెత్తనం లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చిరా బికం, రామదాసు, అనిత నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వరు తదితరులు పాల్గొన్నారు.

**ఇసుక, మట్టి అక్రమ రవాణా ను అరికట్టాలి...**

బీజేపీ మండలం లో ఇసుక, మట్టి అక్రమ రవాణా చేస్తున్నారని వాటిని వెంటనే అరికట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం ను డిప్యూటీ తహశీల్దార్ కు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నె కృష్ణారావు, సయ్యద్ మోహినుద్దీన్, కె.నాగేశ్వరరావు, తొగాటి నాగచారి, నాగసాయి, నరసింహారావు, గణేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల బారినపడి చిధ్రమవుతున్న యువకుల జీవితాలు

**మణుగూరు ఎస్‌డిపిఓ రవీంద్రారెడ్డి**



ప్రజాపక్షం/మణుగూరు: రోడ్డు ప్రమాదాల బారినపడి ఎందరో యువకుల జీవితాలు చిధ్రమై పోతున్నాయని మణుగూరు ఎస్‌డిపిఓ రవీంద్రారెడ్డి అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల ప్రకారం బుధవారం మణుగూరు ఎస్‌డిపిఓ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో బిటిపిఎస్ మణుగూరు నందు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, తప్పనిసరి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, అదేవిధంగా తమ వెహికల్ కి ఇన్సూరెన్స్ తీసుకొని ఉండాలని, యువత మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగంగా, అజాగ్రత్తగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ, ట్రిబుల్ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. బస్సుల్లో ప్రయాణించినప్పుడు ఫుట్ బోర్డు ప్రయాణం చేయరాదని, అంతేగాక ఆటోలో పరిమితికి మించి ప్రయాణించకూడదన్నారు. యువత స్పీడ్ డ్రైవింగ్ మరియు బైక్ రేసింగ్ లు వల్ల ప్రమాదాల బారిన పడి వాళ్ల విలువైన జీవితం మరియు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ప్రతీ కుటుంబం పట్ల, సమాజం పట్ల బాధ్యతగా ఉండి డ్రైవింగ్ చేయాలని తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరారు. అలాగే ఎవరైనా రోడ్డు ప్రమాదాల బారిన పడితే వారి సమాచారం పోలీస్ వారికి మరియు 108 కి అందించి, ఇంకా వారిని దగ్గరలోని ఆసుపత్రికి తరలించడంలో సహాయపడాలన్నారు. మన నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల కొన్ని కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, బిటిపిఎస్ సీఈ, ఎస్ఈ, డిఈ, ఏఈ పాల్గొన్నారు.

## ఆత్మ కమిటీ చైర్మన్‌గా కర్నాటి రామకోటేశ్వరరావు



ప్రజాపక్షం/ మధిర : ఆత్మ కమిటీ చైర్మన్‌గా కర్నాటి రామకోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మధిర రైతు వేదిక నందు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సహాయ సంచాలకులు మిట్టపల్లి సతీష్ అధ్యక్షతన ఆత్మ కమిటీ చైర్మన్, డైరెకర్టు, బిఎఫ్ఎసి కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. అలాగే డిస్ట్రిక్ట్ ఫార్మర్స్ అడ్వైసరీ కమిటీకి కొప్పుల గోవిందరావు(లచ్చగూడెం), నల్లమోతు సత్యనారాయణ(రామాపురం, బోనకల్)ను ఎన్నుకోవటం జరిగింది. ఇదిలా ఉంటే ఆత్మ కమిటీ డైరెక్టర్లుగా నియామకమైన నిడమానూరి వంశీ, దారా బాలరాజులు సమావేశానికి గైర్హాజరై ప్రమాణస్వీకారం చేయలేదు. చిన్న పదవి అని అసంతృప్తి వలన ప్రమాణస్వీకారానికి రాలేదా అని రాజకీయ పార్టీలో చర్చ కొనసాగుతుంది. ప్రమాణ స్వీకారం చేయని దారా బాలరాజుకి అమ్మా ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని ఫోన్ చేసి సముదాయించినట్లు తెలిసింది. నిడమానూరి వంశీ మండల కాంగ్రెస్ కమిటీ రేసులో ఉండగా ఆత్మకమిటీ డైరెక్టర్ పదవికి అంత ప్రాముఖ్యత లేకపోవడంతో కార్యకర్తగానే ఉంటానని తెలిపినట్లు సమాచారం. దీనిపై డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఏమి నిర్ణయం తీసుకుంటారో అని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. ఈసమావేశంలో ఐదు మండలాల వ్యవసాయాధికారులు కె.సాయిదీక్షిత్, పి.వినయ్‌కుమార్, బి.సాయిశివ, మానస, టి.వేణు, వ్యవసాయ విస్తరణాధికారులు టి.జిష్ణు, బి.అమృత, కె.గురుమూర్తి, టి.సింధూర్, ఎన్.నాగసాయి, ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

## వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలి

**-సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా**
**-సంక్షేమ పథకాలు అందించడమే ఎమ్మెల్యే కూనంనేని లక్ష్యం**
**-పలు గ్రామాల్లో సీపీఐ నాయకుల బృందం పర్యటన**





ప్రజాపక్షం/పాల్వంచ : కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి నెలలో ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలని భద్రాది కొత్తగూడెం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అన్నారు. బుధవారం పాల్వంచ మండల పరిధిలోని కేపీ,జగన్నాధపురం, నాగారంకాలనీ, రంగాపురం, నాగారం, నారాయణరావుపేట, సంఘం గ్రామాలలో జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా నేతృత్వంలో నాయకుల బృందం పర్యటించి పార్టీ ముఖ్యకార్యకర్తలతో, గ్రామాల ప్రజలతో జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజల చిరకాల కోరికలైన కొవ్వూరు రైల్వే లైను, మైనింగ్ యూనివర్సిటీ, ఎరువుల కర్మాగారం ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కోరారు. ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తూ రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చి భారత వ్యవసాయ రంగాన్ని నిలువునా కుదేలు చేయుటకు, బడా పారిశ్రామిక వేత్తలకు ప్రజల భూములను, ఆస్తులను అప్పనంగా దోసి పెట్టేందుకు కేంద్రంలోని నరేంద్రమోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని అందులో భాగంగానే రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చిందని ఆ చట్టాలు రద్దు చేయాలని భారతదేశంలో కనీవిని ఎరుగని రీతిలో రెండు సంవత్సరాల పాటు లక్షలాది మంది రైతులు ఢిల్లీలో గొప్ప పోరాటం నిర్వహించారని, ఆ పోరాటానికి భయపడ్డ మోడీ కొంచెం తగ్గాడని మళ్లీ ఆ చట్టాలను తెచ్చి భారత రైతాంగాన్ని నష్టపరిచేందుకు నరేంద్ర మోడీ సిద్ధమవుతున్న తరుణంలో జగ్జీత్ సింగ్ ధలై వాల్ అనే రైతు ఢిల్లీలో 60, 70రోజుల నుండి అమరణ నిరాహార దీక్ష చేస్తున్నాడని, ఆ రైతు నేడు ప్రాణపాయ స్థితిలో ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు అందజేయాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభల్లో అర్హులైన పేదలకు ఆ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుదని, అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పనిచేస్తున్నారని, సంక్షేమ పథకాలు అందించే విషయంలో ఎటువంటి రాజకీయాలకు చోటు లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాధం, పాల్వంచ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, నాయకులు నిమ్మల రాంబాబు, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, మన్యం వెంకన్న, జక్కరయ్య, వైఎస్ గిరి, జర్పుల మోహన్, లావుడియా చందులాల్, రాందాస్, వెంకటరమణ, శంకర రంగారావు, హరి, హత్తిరామ్, బానోత్ రంజిత్, రవి, చెంచలపురి శ్రీను, సాయిలు, శ్రీను, రాంబాబు, బత్తుల గోపాలకృష్ణ, బాదావత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నిక ఏదైనా కలిసికట్టుగా ఎదుర్కొందాం..

**బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా విజ్ఞప్తి**



ప్రజాపక్షం/మణుగూరు: జనవరి 26 తరువాత ఏ సమయంలో నైనా స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు గ్రామాలలో పర్యటించాలని బీఆర్‌ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గ్రామ అధ్యక్షుని అధ్యక్షతన గ్రామాలలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించుకొని గ్రామసర్పంచ్ గా పాతవారిని కొనసాగిస్తారా లేక కొత్తవారిని ఎంపిక చేస్తారా అనే విషయం ముఖ్యనాయకులు సమావేశమై చర్చించుకోవాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక మరొక్క సారి కూర్చొని సర్పంచ్ అభ్యర్థిని ఎంపిక చేసుకోవాలని, అదే విధంగా సర్పంచ్ ఎన్నిక లేక ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నిక దేనికి నోటిఫికేషన్ ఇచ్చినా మనం సిద్ధంగా ఉండాలని కోరారు. గ్రామాలలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలు, గత అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీలు, మోసాలు ప్రతి నిత్యం ప్రజలలో తీసుకువెళ్ళాలని సూచించారు. మనం చేసిన అభివృద్ధి సంక్షేమం ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నిక ఏదైనా మనం కలిసి కట్టుగా ఎదుర్కొని, పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. భద్రాద్రి జిల్లాలో అత్యధిక స్థానాలు గెలవడమే లక్ష్యంగా ముందుకు సాగుదాము అని, మూడోసారి కేసిఆర్‌ని ముఖ్యమంత్రిగా గెలిపించేవరకు వెనుదిరిగేదే లేదని రేగా స్పష్టం చేశారు.

## పిండిప్రోలు గ్రామపంచాయతీ ఆకస్మిక తనిఖీ







ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : పిండిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఆశాలత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలో పలు రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు రికార్డులు గ్రామ పంచాయతీ సంబంధించిన పనుల వివరాలు పొందుపరచాలని పంచాయతీ కార్యదర్శి టి.రాముకి సూచనలు ఇచ్చారు. అనంతరం గ్రామంలోని స్మశాన వాటిక, సెగ్రిగేషన్ షెడ్, నర్సరీ, సైడ్ డ్రైనేజీ, పరిశీలించి గ్రామ పంచాయతీ లో సైడ్ కాలువలను గ్రామపంచాయతీ వర్కర్స్ తో శుభ్రపరచాలని సైడ్ కాలువలో నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రతిరోజు తడి చెత్త పొడి చెత్త సేకరించాలని ఆమె తెలిపారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తరగతి గదులను పరిశీలించి 10వ తరగతి పరీక్షల సమయం దగ్గర పడుతున్న సమయంలో విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు తీసుకొని నూటికి నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయుల కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ తీసుకుంటుందని లక్షల రూపాయలు వెచ్చించి పౌష్టిక ఆహారం అందిస్తున్న మెనూలో ఎలాంటి మార్పులు ఉండొద్దని మధ్యాహ్న భోజన వర్కర్లకు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో యంపిఓ పి.సూర్యనారాయణ, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు జ్యోతి, పంచాయతీ కార్యదర్శి టి.రాము గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామి సిబ్బందికి మూడు నెలలుగా అందని జీతాలు

**- జీతాలు ఇప్పించాలంటూ ఎంపీడీవోకు వినతి**



ప్రజాపక్షం/పాల్వంచ : ఉపాధి హామి పథకంలో పనిచేస్తున్న సిబ్బంది ఏపీవో, ఈసీ, కంప్యూటర్ ఆపరేటర్లు, క్షేత్ర సహాయకులకు గత మూడు నెలలుగా జీతాలు రాకపోవడం తో ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని, ఇట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జీతాలు ఇప్పించాలని కోరుతూ బుధవారం ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పోరండ్ల రంగా, ఈసీ పుల్లయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు లక్ష్మణ్, రాజేష్, క్షేత్ర సహాయకులు నాగేశ్వరరావు, శంకర్, రాములు, శ్రీను పాల్గొన్నారు.

## నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ప్రజాపక్షం/దమ్మపేట: బీఆర్‌ఎస్ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, నియోజకవర్గ ఇన్చార్జి మెచ్చా నాగేశ్వరరావు ఆదేశాల మేరకు నేడు ఉదయం 10 గంటలకు మండల ఎంపిడిఓ కార్యాలయంలోనీ మహాత్మా గాంధీ విగ్రహనికి నివాళులు అర్పించి, హామీలు అమలు చేసే బుద్ధిని ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ, వినతి పత్రం సమర్పిస్తూ చేసే నిరసన కార్యక్రమంలో మండలంలోని పార్టీ శ్రేణులు అందరూ హాజరు కావాలని బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి దొడ్డా రమేష్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావటానికి డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ఎన్నో అమలుగాని హామీలను, గ్యారంటీల పేరుతో 420 బూటకపు హామీలను ఇచ్చి 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, అమలు చెయ్యకుండా తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి రేపటికి 420 రోజులు అవుతునా హామీలు అమలు చేయటంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైన సందర్భంగా ఈ నిరసన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఈశ్వర్ రెడ్డి మృతిపట్ల సిపిఐ సంతాపం



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మున్సిపాలిటీ పరిధి లెనిన్ నగర్ గ్రామానికి చెందిన మాజీ సింగరేణి కార్మికులు పికే 1 హెడ్ ఒర్మెన్ కిలిమి ఈశ్వర్ రెడ్డి గుండెనొప్పితో మృతి చెందారు. విషయం తెలియగానే సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు తోట రమేష్, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, కార్యవర్గ సభ్యులు కన్నెబోయిన ప్రసాద్ తదితరులు ఈశ్వర్‌రెడ్డి పార్థీవదేహాన్ని సందర్శించి, పూల మాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం గిరిజన మహోన్నరేటింగ్ అధికారి రాములు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను పరిసరాల పరిశుభ్రతను మౌలిక వసతులను పరిశీలించిన అనంతరం మెనూ అందుతున్న తీరును పదో తరగతి విద్యార్థినిల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. నూరు శాతం ఫలితాలను సాధనకు కృషి చేయాలని, విద్యార్థులను గ్రూపుల వారిగా విడదీసి వారి విద్య ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల సంక్షేమ అధికారిని విజయనిర్మల, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు గుర్తించి పరిష్కరిస్తా..



ప్రజాపక్షం/సత్తుపల్లి: సింగరేణి కార్మికుల సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు జేవిఆర్ ఓసి మేనేజర్ బెజ్జంకి రాజేశ్వరరావు. మణుగూరు ఓసి నుండి బుధవారం సత్తుపల్లిలోని జలగం వెంగళరావు ఓసికి బదిలీపై వచ్చిన నూతన మేనేజర్ రాజేశ్వరరావు ను సింగరేణి ఎస్.టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్తగూడెం ఏరియా వర్కింగ్ ప్రెసిడెంట్ ధారా భీమయ్య, జె.వి.ఆర్.ఓ.సి.పి ఎస్ టి సంఘం ఫిట్ కార్యదర్శి భాస్కర్ లాల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ బెజ్జంకి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం అసోసియేషన్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. కార్మికుల సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురాగలిగితే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు వీరభద్రు, మోతిలాల్, వినయ్ కుమార్, రాజారామ్, రమేష్, కిరణ్, సురేష్ దాస్, సక్రు, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా విద్యాశాఖ అధికారికి సన్మానం






**ప్రజాపక్షం/భద్రాచలం :** లక్ష్మీ నగరం గ్రామం నందు నూతనంగా ఏర్పడిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు కృషి చేసినందుకు గాను జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి నీ లక్ష్మీనగరం గ్రామ పెద్దలు, యువత విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాధ్యాయుల, గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి మండల విద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య, శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న గ్రామ పెద్దలను యువతను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం గ్రామస్తులు పాఠశాలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోగా వారు సానుకూలంగా స్పందించారు. పాఠశాలకు సంబంధించిన ఎటువంటి ఇబ్బందులు ఉన్న వాటిని వెంటనే తీరుస్తామని హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బొడ్డు నాగేశ్వరరావు, హైమావతి, విద్యార్థులు, గ్రామ పెద్దలు, గ్రామ యువత పాల్గొన్నారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

## రేపు జరగబోయే కాంట్రాక్టు కార్మికుల మహాసభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :-** ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్రం రెండోవ మహాసభ ఈనెల 31న ఇల్లందులో జరుగు మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ, బుధవారం కొత్తగూడెం కార్పొరేట్ బాబు క్యాంపు రైటర్ బస్తి డిపార్ట్మెంట్లో లో జరిగిన సమావేశంలో కరపత్రాలు పంచారు. పిఎస్‌సిడబ్ల్యూయుటియుసిఐ అనుబంధం రీజియన్ అధ్యక్షులు పెద్ద బోయిన సతీష్ పాల్గొని మాట్లాడుతూ, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు, డ్యూటీకి హాజరుకపోతే పెనాల్టీలు వేసి కార్మికుల దగ్గర కాంట్రాక్టర్ ద్వారా ముక్కు, పిండి వసూలు చేస్తున్నారని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల ప్రతి నెల జీతం నుండి, కట్ చేసిన డబ్బులు వారి యొక్క సీఎం పిఎఫ్ ఖాతాలో, ఎందుకు జమ చేయడం లేదని అన్నారు. కనీసం కాంట్రాక్ట్ కార్మికులకు హక్కులు లేకుండా, సెలవులు లేకుండా జీతాలు పెంచకుండా కార్మికుల శ్రమ, దోపిడీ చేస్తున్నారని ఈ దోపిడిని అరికట్టాలని, కోల్ బెల్ట లో ఉన్న ఎమ్మెల్యేలకు, అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చిన, సింగరేణి అధికారులు మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. కండ్ల ముందే కార్మికుల చెమటతో, కట్టించిన క్వార్టర్సులను ఒక్కొక్కటిగా కూలుస్తున్నారు తప్ప అవి కార్మికులకు ఇయ్యటందుకు సింగరేణి యాజమాన్యానికి గాని ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడం ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచేందుకు ఈ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. మహాసభకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని తమ హక్కులు సాధించేందుకు పోరాటా రూపాలు చర్చించేందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి కృష్ణ సంధ్య, ప్రభాకర్ శాంత, హుస్సేన్ బి.రామకృష్ణ భగవాన్, సునీత, సుమిత్ర, శిరీష, రమణ, పోశం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# 108లో వాహనంలో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

**ప్రజాపక్షం/పెనుబల్లి:** గర్భిణీకి 108 వాహనం లోనే 108 సిబ్బంది కాన్పు చేసిన ఘటన పెనుబల్లి మండలంలో చోటుచేసుకుంది. పెనుబల్లి మండలం లింగగూడెం గ్రామానికి చెందిన కొప్పుల వెంకట రామారావు భార్య శిరీషకు పురిటి నొప్పులు వస్తున్నాయని ఆశ వర్కర్ కుమారి పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని 108 కి ఫోన్ చేశారు. హుటాహుటిన బయలుదేరిన 108 సిబ్బంది లింగగూడెంలోని శిరీష ఇంటికి వెళ్లారు. శిరీషను 108 వాహనంలో ఎక్కించిన తర్వాత నొప్పులు ఎక్కువ కావడంతో ఆశా వర్కర్ కుమారి 108 సిబ్బంది రామకృష్ణ, వేణు సహకారంతో సమయస్ఫూర్తిగా వ్యవహరించి వాహనం లోనే కాన్పు చేశారు. శిరీష పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డను పెనుబల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. సమయస్ఫూర్తితో కాన్పు చేసిన 108 సిబ్బందిని, ఆశా వర్కర్ శిరీష కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## వైరా మున్సిపాలిటీలో వీధి లైట్ల ఏర్పాటు



**ప్రజాపక్షం/వైరా :** మున్సిపాలిటీ పరిధిలో వీధి లైట్లను అధికారులు ఏర్పాటు చేశారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని మధిర రోడ్డులో వీధి లైట్లు వెలగడం లేదన్న విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ చింతా వేణు బుధవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. సిబ్బందితో రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్తంభాలకు వీధి లైట్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో ఎక్కడైనా వీధి లైట్లు వెలగకుండ ఉంటే తనకు సమాచారం అందించాలని తెలిపారు. వీధి లైట్లు వేసే సిబ్బంది కూడా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీధి లైట్లు వెలగని ప్రాంతంలో వెంటనే లైట్లు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు, వితంతువులకు నూతన వస్త్రాల పంపిణీ



**ప్రజాపక్షం / పాల్వంచ :** ఆల్ ఇండియా టు క్రిస్టియన్ కౌన్సిల్ ఐటీటీసీసీ ఆధ్వర్యంలో జయశాలి బైబిల్ రీసెర్చ్ సెంటర్ పాల్వంచ, మంచికంటీనగర్‌లోని నాగభూషణం, జయమ్మ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వృద్ధులకు, వితంతులకు నూతన వస్త్రాల బహుకరణ చేశారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ.. నిరుపేదవారైన వృద్ధులకు, వితంతువులకు గుర్తించి ఆల్ ఇండియా టు క్రిస్టియన్ కౌన్సిల్ ఐటీటీసీసీ మీటింగ్ సందర్భంగా నూతన వస్త్రాలు పంపిణీ చేయడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జోన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఇ.సంతోష్‌కుమార్, బివోయాల్ బిఐడి రాంబాబు, పివి రత్నం, బి.రవి, కె.విజయ్‌కుమార్, నాగభూషణం, జయప్రకాష్, దేవరాజ్, సుధాకర్, ఏఐటీసీసీ ఉమెన్స్ వింగ్ జి.సునీత, జయ, అరుణ, రాణి, బేబీ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత విద్యార్థి కుటుంబానికి రూ.5లక్షలు చెక్కు అందజేత



**ప్రజాపక్షం/మధిర రూరల్ :** మధిర మండలం కృష్ణాపురం గ్రామంలోని ముదిగొండ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ కళాశాలలో ఇంటర్ ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతున్న సాయివర్ధన్ అనే విద్యార్థి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సంఘటన విధితమే. బాధిత విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.5లక్షల చెక్కును బుధవారం ముదిగొండ తహశీల్దార్ కార్యాలయం నందు ఖమ్మం ఆర్‌డిఓ నర్సింహారావు విద్యార్థి తల్లిదండ్రులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సునీత ఎల్జిబెత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బుల్లెట్ బాబు, స్కూల్ చైర్మన్ చప్పిడి వెంకట్రావు, టిజిపిఎ భద్రాద్రి జోన్ కమిటీ జనరల్ సెక్రటరీ సుదర్శన్, జాయింట్ సెక్రటరీ చప్పిడి అనూష, స్కూల్ కమిటీ ఉపాధ్యక్షులు కట్టకూరు ఉమారావు తదితరులు పాల్గొన్నారు.

## శేషమ్మకు నివాళులర్పించిన మట్టా



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని సిద్దారం గ్రామానికి గోళ్ళమూడి శేషమ్మ బుధవారం మృతి చెందగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్, శేషమ్మ నివాసానికి చేరుకుని శేషమ్మ పార్థివదేహానికి పూల మాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మట్టా దయానంద్ వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద బాబు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, మహమ్మద్ కమల్ పాషా,మట్టా చెన్నారావు, గోళ్ళమూడి మధు, సారధి రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## క్షత్రియ వృద్ధుల మందుల కోసం 'వసుధ' చేయూత



**ప్రజాపక్షం/మణుగూరు:** క్షత్రియ సంఘంలోని వృద్ధుల మందుల కోసం వసుధ ఫౌండేషన్ చేయూతనందించింది. బుధవారం మణుగూరు లో జరిగిన కార్యక్రమంలో క్షత్రియ సంఘానికి చెందిన 8 మంది వృద్ధులకు మందుల కొనుగోలు కోసం ఒక్కొక్కరికి రూ 5 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ఆదేశాల మేరకు వృద్ధులకు నగదును భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం విశ్రాంత కార్యనిర్వహణాధికారి, క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు వెగేశ్న రామకృష్ణంరాజు, సుబ్బరాజు, రామచంద్ర రాజులు అందజేశారు. ఈ కార్యక్రమంలోవసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు, క్షత్రియ సేవా సంఘం మణుగూరు సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం / పాల్వంచ :** రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కాపర్తి వెంకటాచారి, కార్యదర్శి వారాధి సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఆ సంఘం క్యాలెండర్‌ను పాల్వంచ తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్ధార్ వివేక్ చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్ధార్ మాట్లాడారు. అనంతరం పాల్వంచ బ్రహ్మంగారి నూతన ఆలయ కమిటీ సభ్యులు తహసీల్ధార్ వివేక్ ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మొగులోజు సీతారామాచారి, కాసర్ల రామారావు, బ్రహ్మంగారి గుడి ఆలయ నూతన కమిటీ అధ్యక్షుడు నాంపల్లి వేణుగోపాలచారి, కార్యదర్శి మోతుకూరి రవి, కోశాధికారి జుజ్జూరి ప్రభాకరాచారి, తిరుపతి, వెంకటేశ్వర్లు, వెంకటాచారి, సీపీఐ పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబా, మస్నా శ్రీనివాసరావు, శేఖర్‌బాబు, గోపాల్, జోగేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా విక్రయిస్తున్న ఆరుగురు మహిళలపై బైండోవర్ కేసు నమోదు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి ఎస్ జానయ్య ఆదేశాల మేరకు జూలూరుపాడు మండల పరిధిలో పట్టుబడిన నాటు సారాయి అమ్మకం దారులైన హలవత్ పద్మ, గూగుల్ అన సూర్య, భూక్య విజయ, భూక్య లక్ష్మి, లకావత్ జమున, బుక్య కమిలి అనే ఆరుగురు మహిళలను బుధవారం జూలూరుపాడు తహశీల్దార్ ముందు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎల్ జయశ్రీ, హెడ్ కానిస్టేబుల్ ప్రకాశరావు హాజరుపరచగా వారు మరోసారి నాటు సారాయి అమ్మకాలు జరుపమని, ఒకవేళ పట్టుబడితే రు. రెండు లక్షల రూపాయలు లేదా జైలు శిక్షకైనా అంగీకారిస్తాం అని ఒక్కొక్కరు రెండు లక్షల రూపాయల బాండ్ పేపర్స్ సమర్పించారు.

# అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా

**-నోడల్ ఆఫీసర్ జి. నాగప్రసాద్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రానున్న వేసవిలో అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించడానికి సమిష్టిగా కృషి చేయాలని నోడల్ ఆఫీసర్ జి. నాగప్రసాద్ తెలిపారు. బుధవారం ఖమ్మం మామిళ్ల గూడెంలోని సర్కిల్ కార్యాలయంలో జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేందర్, ట్రాన్స్ కో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, డివిజనల్ ఇంజనీర్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌తో నోడల్ ఆఫీసర్ నాగప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికలకు అనుగుణంగా సకాలంలో అన్ని పనులు పూర్తి చేయించాలన్నారు. సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్లలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ ఆఫీసర్లతో సమీక్షలు నిర్వహించాలని ఎస్ఈకి సూచించారు. ఆసుపత్రులు, ఇతర అత్యవసర సర్వీసులకు ప్రత్యామ్నాయ పద్ధతులలో విద్యుత్ సరఫరాకు ఇంటర్ లింకింగ్ లైన్స్ వ్యవస్థను పూర్తిగా పటిష్ట పర్చాలన్నారు. విద్యుత్ అంతరాలు వెంటనే పరిష్కరించడానికి ఎమర్జెన్సీ రెస్టోర్ టీమ్ వాహనాలను ఉపయోగించాలన్నారు. రబీకి సరిపడ విద్యుత్ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేందర్ మాట్లాడుతూ రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడకుండా 13 సబ్ స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ల సామర్థ్యాన్ని లోడ్‌కు అనుగుణంగా పెంచడం జరిగిందన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడు పడకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను, ఇంప్రూమెంట్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎస్టిమెట్ తయారు చేసి మంజూరు తీసుకోవాలని సూచించారు. వాటికి సంబంధించిన ఫిల్లర్స్, దిమ్మెలను కట్టి సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు కావాల్సిన మెటీరియల్ ఇండెంట్‌ను వెంటనే సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్లు నాగేశ్వరరావు, రామారావు, రాములు నాయక్, శ్రీనివాస్, బాబురావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# బోనకల్ రైల్వేస్టేషన్ సమస్యలను పరిష్కరించాలి

**-గోవిందాపురం(ఎ) అండర్ బ్రిడ్జి నిర్మించాలి**
**-రైల్వే అధికారులకు వినతులు**



**ప్రజాపక్షం/బోనకల్:** బోనకల్లు రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అఖిల పక్ష నాయకులు, స్థానిక ప్రజలు కమిషన్ ఆఫ్ రైల్వేస్వేఫ్టీ అధికారి మాధవి, సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ మేనేజర్ భర్తేష్‌కుమార్ జైన్‌లను కలిసి వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. మూడవ రైల్వే నిర్మాణం వలన మండల కేంద్రంలో ట్రాక్‌కు రెండు వైపుల ఇనుపకడ్డీలతో రాకపోకలకు నిలిపివేశారని, దీంతో మండలవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైల్వే ట్రాక్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరారు. రైల్వే స్టేషన్‌లో శాతావాహన, ఇంటర్‌సిటి, పద్మావతి, షిరిడి ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేయాలని కోరారు. దీంతో రెండవ ప్లాట్‌ఫాంలో టికెట్ బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు, తదితర సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం గోవిందాపురం(ఎ) వద్ద జరుగుతున్న మూడవ లైన్ రైల్వే పనులను సిఆర్‌సి, డిఆర్‌ఎం అధికారులు పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు భాగం నాగేశ్వరరావు, భాగం పాపారావులు అఖిల పక్ష నాయకులు, స్థానిక ప్రజలు, రైతులతో కలిసి అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, బిజెపి జిల్లా కార్యదర్శి గుగులోత్ నాగేశ్వరావు,, సిపిఎం మండల కార్యదర్శి కిలారి సురేష్, టిడిపి మండలాధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు చేబ్రోలు వెంకటేశ్వర్లు, బిపి నాయక్, భూక్యా సైదానాయక్, బిజెపి దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరి సురేష్, ఓబిసి జిల్లా కార్యదర్శి జంపాల రవి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, సిపిఎం నాయకులు గుగులోత్ పంతు, తెల్లాకుల శ్రీనివాసరావు, గుగులోత్ నరేష్, బిజెపి మాజీ మండలాధ్యక్షులు వీరపనేని అప్పారావు, సిపిఐ నాయకులు గుంపుల జయరాజు, రావినూతల మాజీ సర్పంచ్ షేక్ నజీరు, వ్యాపారస్తులు రంగా జనార్ధన్, గుర్రం పుర్ణయ్య, పల్లపోతుల గోపి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలని ధర్నా




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆర్ గ్యారెంటీలను అమలు చేయాలని మాస్ లైన్ ప్రజాపంథా తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సమస్యలతో కూడుకున్న వినతిపత్రాన్ని డిప్యూటీ తహాసిల్దార్ నరసింహారావుకు అందించారు. అనంతరం ఈ సందర్భంగా మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు రేపాకుల శివలింగం తుమ్మిడి హనుమంతరావు మాట్లాడుతూ, తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని తెలిపారు. నిరుపేద మహిళలకు 2500 వృద్ధాప్య పెన్షన్లు 4000 వికలాంగులకు 6000 ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు 10,000 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ ఒక్క హామీ అమలు చేయలేదని, వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ ప్రజాపంథా పాలేరు డివిజన్ నాయకులు బానోత్ శంకర్, పులిగుజ్జు వెంకటస్వామి, మీగడ సత్యం, చింతలపూడి శ్రీనివాసరావు, బోర ఎలమంచి, తోకల సీతారాములు, కాంపాటి రామారావు. రాయింఢ్ల చిరంజీవి, రామనబోయిన నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గంధం అపార్ట్‌మెంట్ వద్ద మురికినీరు తొలగింపు




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న గంధం అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న మురుకునీటిని బుధవారం వైరా మున్సిపాల్ కమీషనర్ మున్సిపాల్ సిబ్బందితో బయటకు తరలించే ప్రయత్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా అపార్ట్‌ంట్ ముందు రెండు గంటలు ఏర్పాటు చేసి నింపిన మురికి నీటిని బయటకు వాహనాలు సాయంతో తరలించారు. ఇప్పటికే గంధం అపార్ట్‌మెంట్ మురికినీటితో చుట్టుప్రక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా రోడ్డపైకి నీరు రాకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా శాశ్వత పరిష్కారం చూపే విధంగా అధికారులు చర్యలు చెప్పాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ సందర్భంగా మున్సిపాల్ కమీషనర్ చింతా వేణు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడుతున్నామని త్వరలోనే పరిష్కార మార్గం చూపించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కోయచలకలో పర్యటించిన ట్రైనీ కలెక్టర్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండల పరిధిలోని కోయచలక గ్రామంలో శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట పర్యటించారు. బుధవారం ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట కోయచలక గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని, గ్రామ పంచాయతీ కేంద్రాన్ని సందర్శించారు. శిక్షణలో భాగంగా పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో అమలవుతున్న వివిధ పథకాల గురించి చర్చించారు. రైతుల స్థితి గతులు, బ్యాంకు రుణాలు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన పలు అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. శిక్షణలో భాగంగా గ్రామస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు గురించి క్షేత్రస్థాయిలో ట్రైనీ కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హైపర్ 2.0కి ఫైన్




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని లలిత కుమారి హాస్పిటల్ రోడ్డులో గల హైపర్ 2.0 కి మున్సిపాలిటీ అధికారులు రూ. 2 వేల ఫైన్ విధించారు. బుధవారం పట్టణంలోని పలు వీధులలో పర్యటించారు మున్సిపాలిటీ కమీషనర్ రవి. లలిత కుమారి హాస్పటల్ రోడ్డులో పర్యటిస్తున్న క్రమంలో హైపర్ 2.0 యాజమాన్యం నిర్లక్ష్యంతో రోడ్డుపై చెత్త వేయటంతో పరిసరాలను పరిశీలిస్తున్న కమీషనర్ రోడ్డుపై చెత్త వేయటంపై ఆగ్రహించి రూ.2 వేల ఫైన్ విధించి, యాజమాన్యం నుండి ఫైన్ వసూలు చేశారు. ఆదివారం వరకు ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గం చేతిలో మున్సిపాలిటీ కొనసాగింది. ఆ సమయంలో పట్టణంలో ప్రధాన వీధిలో ప్రతి షాపు ముందు చెత్త భారీగా దర్శనమిచ్చినా అధికారులు ఫైన్ వేసిన ధాఖలాలు కనిపించలేదు. పాలకవర్గ పదవీ కాలం పూర్తయిన రెండు రోజులకే, మున్సిపాలిటీ అధికారులలో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పూర్తిగా స్వేచ్ఛ వచ్చినట్లు అధికారులు తమ చేతులకు పని చెబుతున్నారు.

# కృష్ణవేణి సీడ్స్ మిరప రకంపై క్షేత్ర ప్రదర్శన




**ప్రజాపక్షం/పినపాక:** కృష్ణవేణి సీడ్స్ వారి కెఎస్ 941 వెరైటీ మిరప రకం పంట అధిక చీడపీడలను తట్టుకొని, అధిక పూత కాయలతో అత్యంత దిగు బడులు వస్తాయని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ శంకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పినపాక మండలం, పాతరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని చింతల బయ్యారం గ్రామానికి చెందిన పొనగంటి ఖాదర్ బాబు అనే రైతు మిర్చి పంట చేను దగ్గరకి కృష్ణవేణి సీడ్స్ వారి మిరప రకంపై వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతు సోదరులతో పరిశీలించారు. 25 క్వింటాల పైన దిగబడి కాయ మంచి ముదురు ఎరుపు రంగు, గింజ శాతం ఎక్కువగా ఉండి మార్కెట్లో మంచి ధర లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పంటను పరిశీలించిన 300 మందికి పైగా రైతు సోదరులు ఈ సంవత్సరం కృష్ణవేణి సీడ్స్ మిర్చి రకము అధిక చీడ పీడలను, తెగుళ్ళను తట్టుకొని అధిక పూత, కాయలతో మంచి దిగుబడులు వస్తాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ రాయల్ చంద్రశేఖర్, కళ్యాణ్, పొనగంటి నాగేష్, ముల్లకట్ట శ్రీనివాసరావు, సురేష్, ఖాదర్ బాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలు ఉన్నది ప్రజల రక్షణ కోసమే..



**ప్రజాపక్షం/పినపాక:** విద్యార్థులు రహదారి భద్రతపై అవగాహన ఉండాలని ఈ.బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుదవారం రాధిక హై స్కూల్, శ్రీ విద్యా జూనియర్ కాలేజ్ విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ మాట్లాడుతూ విద్యార్థులు నిబంధనలు పాటిస్తూ మిగిలిన వారికి ఆదర్శంగా ఉండాలని అన్నారు. యువత ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని, నిబంధనలు పాటించకపోవడమే అందుకు కారణమని పేర్కొన్నారు. చట్టాలు ఉన్నది ప్రజల రక్షణ కోసమేనని వాటిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, నాలుగు చక్రాల వాహనం నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాధిక హై స్కూల్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపాల్ సాల్మన్, శ్రీవిద్య జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నిరోషా, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.